## అక్రమ కట్టడాల కూల్చివేత

జవహర్‌నగర్, మే 28: ప్రభుత్వ భూములు అన్యాక్రాంతం కాకుండా చర్యలు తీసుకుంటున్నామని, ఎవరైన అక్రమ నిర్మాణాలు చేపడితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని కాప్రా రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ శ్రీలక్ష్మి హెచ్చరించారు. కాప్రా తాసీల్దార్ సుచరిత ఆదేశాల మేరకు మంగళవారం కార్పొరేషన్ పరిధిలోని సర్వే నం. 499, 500లో అక్రమంగా వెలిసిన నిర్మాణాలను రెవెన్యూ సిబ్బందితో కలిసి కూల్చివేశారు. ఈ సందర్భంగా శ్రీలక్ష్మి మాట్లాడుతూ.. అధికారుల విధులకు ఆటంకం కలిగిస్తే కేసులు పెడతామని అన్నారు. సర్కారు భూముల్లో పేపర్‌పై లేఅవుట్‌లు వేస్తూ అమాయక పేదలకు అమ్ముతూ మోసం చేస్తున్న కబ్జాదారులను వదిలిపెట్టబోమని ఆమె హెచ్చరించారు.

## దమ్మాయిగూడలో చోరీ..

జవహర్‌నగర్, మే 28: బంధువుల ఇంటికి వర్ధంతి కార్యక్రమానికి వెళ్ళి సరికి ఇంట్లో దొంగతనం జరిగింది. జవహర్‌నగర్ డిటెక్టివ్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్ వివరాల ప్రకారం... దమ్మాయిగూడ సాయిసిద్ధార్థకాలనీలో మంగిలిపల్లి రవీందర్, భార్య, కుటుంబ సభ్యులతో కలిసి నివాసముంటున్నారు. ఈ నెల 27న సిద్దిపేటలో వర్ధంతి కార్యక్రమం ఉండగా... కుటుంబసభ్యులతో కలసి వెళ్ళారు. మంగళవారం ఉదయం 7గంటల ప్రాంతంలో ఇంటికి వచ్చి చూడగా తలుపులు పగులగొట్టి కనిపించాయి. 10తులాల బంగారం, వెండి, నగదు ఎత్తుకెళ్ళినట్లు బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

# విత్తన ఎంపికలో రైతులు జాగ్రత్త వహించాలి

### విత్తనాలు డీలర్ వద్ద కొనుగోలు చేసేలా రైతులకు అవగాహన : జిల్లా వ్యవసాయ అధికారి మేరీ రేఖ

మేడ్చల్ రూరల్, మే 28: విత్తన ఎంపికలో రైతులు జాగ్రత్త వహించి ..నాణ్యతతో కూడిన మేలు రకాల విత్తనాలను కొనుగోలు చేయాలని జిల్లా వ్యవసాయ అధికారి మేరి రేఖ తెలిపారు. మేడ్చల్ మండలంలోని నూతన్‌కల్, మైసిరెడ్డిపల్లి, రాయిలాపూర్, రావల్‌కోల్, సైదోనిగడ్డ తండాలో వ్యవసాయ శాఖ అధికారులు వానాకాలం వ్యవసాయ సాగుకు విత్తనాల కొనుగోలులో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై రైతులకు అవగాహన సదస్సులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. వ్యవసాయ శాఖ ద్వారా గుర్తింపు పొందిన డీలర్ల వద్ద మాత్రమే విత్తనాలు కొనుగోలు చేయాలని తెలిపారు. వదులుగా ఉన్న సంచుల్లో ఉన్న విత్తనాలను రైతులు కొనుగోలు చేయరాదని, అదే విధంగా కొనుగోలు చేసిన దుకాణం నుంచి రసీదు తప్పనిసరిగా తీసుకో వాలని సూచించారు. విత్తన ప్యాకెట్, బిల్లును పంటకాలం పూర్తయ్యే వరకు భద్రపర్చాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో మేడ్చల్ మండల వ్యవసాయ అధికారి అర్చన, విస్తీర్ణ అధికారులు సుమిత, తేజస్విని, ఆయా గ్రామాల రైతులు పాల్గొన్నారు.



మేడ్చల్ మండలం, నూతన్‌కల్ గ్రామంలో రైతులకు అవగాహన కల్పిస్తున్న జిల్లా వ్యవసాయ అధికారి మేరీ రేఖ

### బిల్ రశీదును భద్రపర్చుకోవాలి..

కీసర, మే 28 : రైతులు విత్తనాలు కొనే ముందు తగిన బిల్లులు తీసుకోవాలని కీసర మండల వ్యవసాయాధికారి మా ధవీలత తెలిపారు. కీసర మండలంలోని కీసర, యాద్గార్‌పల్లి, కీసరదాయరకు సంబంధించిన రైతులకు 2024 సంవత్సరానికి సంబంధించి విత్తనాలు కొనేముందు రైతులు తీసుకోవాల్సిన జా గ్రత్తల గురించి మంగళవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మాధవీలత మాట్లాడుతూ.. లైసెన్స్ ఉన్న డీలర్ వద్ద మాత్రమే విత్తనాలు కొనుగోలు చేయాలని, పంట దిగుబడివచ్చే వరకు, పంటకాలం అయిపోయే వరకు బిల్ రశీదును రైతులు జాగ్రత్తగా భద్రపరుచుకోవాలని సూచించారు. తీసుకున్న బిల్లు మీద విత్తన కంపెనీ పేరు, విత్తనరకం, బ్యాచ్‌నంబర్, లాట్ నంబర్, రేటు ఉంటుందని, విత్తన ప్యాకెట్ మీద తయారైన తేదీ, కాలం ముగిసిన తేదీ చూసుకోవాలని సూచించారు. జిల్లాల్లో తక్కువ ధరకు, ఎక్కువ ధరకు అమ్మేవారి వివరాలను మండల వ్యవసాయాధికారులకు ఇవ్వాలని సూచించారు. నకిలీ విత్తనాలు, లూస్ విత్తనా లు అమ్మితే తమకు ఫోన్ చేయాలని తెలిపారు. ఏఈఓ వందన, రాజ్‌కుమార్ వివిధ గ్రామాలకు చెందిన రైతులు పాల్గొన్నారు.



విత్తనాల కొనుగోలుపై రైతులకు అవగాహన కల్పిస్తున్న మాధవీలత

### అధికారుల సూచనలు పాటించాలి..

శామీర్‌పేట, మే 28 : విత్తనాల కొనుగోలు సమయంలో రైతులు ఆధికారుల సలహాలు, సూచనలు తప్పనిసరిగా పాటించాలని వ్యవసాయ అధికారులు కృష్ణవేణి, రమేశ్, ఏఈవో రవియాదవ్‌లు అన్నా రు. ఉమ్మడి శామీర్‌పేట మండలంలోని అలియాబాద్, బాబాగూడ, మూడుచింతలపల్లి మండలంలోని లక్ష్మాపూర్, లింగాపూర్‌తండా, మూడుచింతలపల్లి గ్రామ పంచాయతీల్లో మంగళవారం రైతులకు విత్తనాల కొనుగోలు విషయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో రైతులు సదాశివరెడ్డి, కుమార్ యాదవ్, ప్రభాకర్‌రెడ్డి, సంజీవరెడ్డి, యాదగిరి, వెంకటేశ్, తదితరులు పాల్గొన్నారు.



మూడుచింతపల్లిలో విత్తనాల కొనుగోలుపై రైతులకు అవగాహన కల్పిస్తున్న ఏవో కృష్ణవేణి



అల్వాల్ లయోలా కాలేజీ వద్ద రైల్వే స్టేషన్‌ను ఏర్పాటు చేయాలని కోరుతూ డీఆర్‌ఎం భర్తేశ్ కుమార్‌కు వినతి పత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి

## రైల్వే స్టేషన్‌లు ఏర్పాటు చేయాలి

### మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి

మల్కాజిగిరి, మే 28: ప్రయాణికుల సౌకర్యం కోసం అవసరం ఉన్న ప్రాంతాల్లో రైల్వే స్టేషన్‌లు ఏర్పాటు చేయాలని ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి కోరారు. ఈమేరకు మంగళవారం ఆయన.. సికింద్రాబాద్‌లోని రైల్వే కార్యాలయంలో అల్వాల్ లయోలా కాలేజీ వద్ద ఎంఎంటీఎస్ రైల్వే స్టేషన్‌ను ఏర్పాటు చేయాలని కోరుతూ డీఆర్‌ఎస్ భర్తేశ్ కుమార్‌ను కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ఘట్‌కేసర్ నుంచి లింగంపల్లికి ఎంఎంటీఎస్ రైళ్ల ద్వారా ప్రయాణించే వారి సౌకర్యం కోసం కొత్తగా రైల్వే స్టేషన్‌లు ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉందని అన్నారు. కిష్టమ్మ ఎన్‌క్లేవ్ రోడ్డు, మీనాక్షి ఎస్టేట్ అల్వాల్ నుంచి రోజు రోజుకు ప్రయాణికుల రద్దీ పెరుగుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్, జీహెచ్‌ఎంసీ స్టాండింగ్ కౌన్సిల్ మెంబర్ చింతల శాంతిశ్రీనివాస్ రెడ్డి, రైల్వే ట్రావెలర్స్ సంఘం కార్యదర్శి సూర్, సంపత్‌రెడ్డి, మురళీకృష్ణ, అనిల్‌కిశోర్, పరమేశ్, అర్జున్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రేమించమని వేధింపులు.. కేసు నమోదు

శామీర్‌పేట, మే 28 : ప్రేమించమని వేధింపులకు గురి చేస్తున్న ఓ వ్యక్తిపై కేసు నమోదైన సంఘటన శామీర్‌పేట పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకున్నది. పోలీసుల కథనం ప్రకారం... తూంకుంట మున్సిపాలిటీ పరిధిలోని మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా కలెక్టరేట్ కార్యాలయంలో అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ లేబర్ డిపార్ట్‌మెంట్‌లో జూనియర్ అసిస్టెంట్‌గా అజయ్ పనిచేస్తున్నాడు. అయితే.. ఆ కార్యాలయంలోని మరొక విభాగంలో పని చేస్తున్న మహిళా జూనియర్ అసిస్టెంట్‌ను ప్రేమించమని వెంటపడుతున్నారు. దీంతో వేధింపులు తాళలేక బాధితురాలు ఈ నెల 25న పోలీసులకు ఫిర్యాదు చేయగా.. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

## వ్యక్తి అదృశ్యం

జవహర్‌నగర్, మే 28: అనారోగ్యంతో బాధపడుతూ ఇంటి నుంచి బయటకు వెళ్ళిన ఓ వ్యక్తి అదృశ్యమయ్యాడు. ఈ సంఘటన జవహర్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఎస్‌హెచ్‌వో నాగరాజు తెలిపిన వివరాల ప్రకారం... దమ్మాయిగూడ సాయిసిద్ధార్థకాలనీలో సుసాన్ స్టానిస్లాస్ కుటుంబసభ్యులతో కలిసి నివాసముంటున్నాడు. కొంత కాలంగా అతను అనారోగ్యంతో బాధపడుతున్నాడు. ఈ నెల 22న ఇంట్లో ఎవరికి చెప్పకుండా బయటకు వెళ్ళి ఇంత వరకు తిరిగి రాలేదు. అతని ఆచూకి కోసం చుట్టుపక్కల, బంధువుల వద్ద వెతికిన సమాచారం లభించలేదు. మంగళవారం కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.



స్టానిస్లాస్(ఫైల్)

## గ్యాస్ రీపిల్ చేసి విక్రయం..

ఘట్‌కేసర్,మే28 : పెద్ద సిలిండర్ల నుంచి గ్యాస్‌ను రీపిల్ చేసి విక్రయిస్తున్న వ్యక్తిని ఘట్‌కేసర్ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఘట్‌కేసర్‌లోని హీనా బ్యాంగిల్ స్టోర్‌లో సయ్యద్ నుస్రత్ ఉస్మాన్ పెద్ద గ్యాస్ సిలిండర్ల నుంచి గ్యాస్‌ను చిన్న సిలిండర్లకు మార్చి విక్రయిస్తున్నాడు. సమాచారం అందుకున్న పోలీసులు అతనిని అదపులోకి తీసుకొని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు.



సర్వసభ్య సమావేశంలో మాట్లాడుతున్న అధికారులు

## సమస్యల పరిష్కారమే లక్ష్యంగా ప్రభుత్వపాలన

శామీర్‌పేట, మే 28 : ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా ప్రభుత్వ పరిపాలన సాగుతుందని అధికారులు అన్నారు. మూడు చింతలపల్లి గ్రామ పంచాయతీ సమావేశ మందిరంలో మండల పరిషత్ సర్వసభ్య సమావేశం మంగళవారం నిర్వహించారు. ప్రజా సమస్యల పరిష్కారం, మౌలిక సదుపాయాల కల్పనకు ప్రభుత్వం ప్రణాళిక బద్ధంగా వ్యవహరిస్తుందన్నారు. ప్రత్యేక అధికారుల పాలనలో ప్రజా సమస్యలపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ హారిక, వైస్ ఎంపీపీ మంద శ్రీనివాస్‌రెడ్డి, ఎంపీడీవో వత్సలాదేవి, తాసీల్దార్ వెంకటనర్సింహారెడ్డి, ఎంపీటీసీలు హనుమంత్‌రెడ్డి, అఖిలేశ్‌రెడ్డి, నాగరాజు, కో ఆప్షన్ సభ్యుడు గౌస్ పాషా, అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## అనుమతిలేని పాఠశాలలు, కాలేజీల గుర్తింపు రద్దు చేయాలి

చర్లపల్లి, మే 28 : జిల్లా వ్యాప్తంగా అనుమతిలేని పాఠశాలలు, కాలేజీల గుర్తింపు రద్దు చేసేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని ఏఐఎస్‌ఎఫ్ జిల్లా కార్యదర్శి ఎండీ అన్వర్ కోరారు. ఈ మేరకు మంగళవారం ఏఎస్‌రావునగర్ డివిజన్, ఈసీఐఎల్ చౌరస్తాలోని అంబేద్కర్ విగ్రహం వద్ద విద్యాసంస్థల్లో ఫీజుల దోపిడీని అరికట్టేందుకు చర్యలు తీసుకోవాలని కోరుతూ నిరసన చేపట్టారు. ఈ సందర్భం గా ఆయన మాట్లాడుతూ.. ప్రైవేట్ కార్పొరేట్ పాఠశాలలు, కాలేజీల యాజమాన్యాలు అనుమతులు రాకముందే విద్యార్థుల తల్లిదండ్రులను మోసం చేస్తూ విద్యా వ్యాపా రం చేస్తున్నా సంబంధిత అధికారులు పట్టించుకోవడంలేదన్నారు. నిబంధనలకు విరుద్ధంగా అనుమతిలేని పాఠశాలలు, కాలేజీలను గుర్తించడంతోపాటు ఫీజుల నియంత్రణను చేపట్టాలని, లేనిచో జిల్లా వ్యాప్తంగా పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడుతామన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు హరీష్, అరవింద్, సాయి, నరేశ్, శివ, అదిత్య, మనోహర్ తదితరులు పాల్గొన్నారు.



ఈసీఐఎల్ చౌరస్తాలో అనుమతిలేని పాఠశాలలు, కాలేజీల గుర్తింపు రద్దు చేయాలని కోరుతూ నిరసన వ్యక్తం చేస్తున్న ఏఐఎస్‌ఎఫ్ నాయకులు

## శివలింగాల చుట్టూ పచ్చదనం ..



కీసరగుట్ట శ్రీ భవానీ రామలింగేశ్వరస్వామి ఆలయంలో ఉన్న శివలింగాల చుట్టూ చక్కటి ఆహ్లాదకరమైన వాతావరణం నెలకొన్నది. గతంలో ఇక్కడ పనిచేసిన ఈఓ కట్టా సుధాక ర్‌రెడ్డి నేతృత్వంలో హరితహారం కార్యక్రమంలో భాగంగా శివలింగాల చుట్టూ మొక్కలు నాటారు. ఆ మొక్కల ఆలనాపాలనా సిబ్బందితో ప్రతినిత్యం చూసుకోవడంతో నేడు అవి ఏపుగా పెరిగాయి. దీంతో శివలింగాల చుట్టూ పచ్చదనం సంతరించుకున్నది. – *కీసర, మే 28*

## ఎన్‌టీఆర్‌కు ఘన నివాళి..

మేడ్చల్, మే 28 : దివంగత మాజీ ముఖ్యమంత్రి నందమూరి తారక రామారావు జయంతిని మంగళవారం మేడ్చల్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా మేడ్చల్ పట్టణంలో జాతీయ రహదారి పక్కన ఉన్న ఎన్టీఆర్ విగ్రహానికి ఎన్టీఆర్ విగ్రహ పరిరక్షణ సమితి అధ్యక్షుడు వాసువర్మ ఆధ్వర్యంలో పూల మాలలు వేసి నివాళులర్పించారు. కేక్ కట్ చేసి, పంచి పెట్టారు. కార్యక్రమంలో మాజీ ఉపసర్పంచ్ నర్సింహారెడ్డి, మాజీ ఎంపీటీసీ మురళీ గౌడ్, నాయకులు సుధాకర్ గౌడ్, వెంకట్ రావు, బాలకృష్ణ, మౌలానా, బస్వా, శ్రీపాల్ పాల్గొన్నారు.

**రామంతాపూర్‌లో..**

రామంతాపూర్,మే 28 : ఎన్‌టీ రామారావు జయంతి వేడుకలను మంగళవారం రామంతాపూర్‌లో అభిమానులు ఘనంగా నిర్వహించారు. ఆనంద్‌నగర్ చౌరస్తాలో ఆయన భారీ చిత్రపటం ఏర్పాటు చేసి పూలమా లవేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో నాయకులు పాల్గొన్నారు.

- చర్లపల్లి : ఎన్టీఆర్ జయంతి సందర్భంగా ఏఎస్‌రావునగర్ డివిజన్ జమ్మిగడ్డలో నిర్వహించిన కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర మాజీ అధ్యక్షుడు బక్కిన నర్సింహులు, జిల్లా అధ్యక్షుడు అశోక్‌కుమార్‌గౌడ్, నీరుకొండ సతీష్‌బాబు పాల్గొన్నారు.
- ఎన్టీఆర్ జయంతి సందర్భంగా హెచ్‌బీ కాలనీ డివిజన్ ఎన్టీఆర్ చౌరస్తాలో కాకతీయ సేవా సమితి ఆధ్వర్యంలో నిర్వహించిన అన్నదాన కార్యక్రమంలో కార్పొరేటర్ ప్రభుదాస్, మాజీ కార్పొరేటర్లు పాల్గొన్నారు.

## ఆకలి రహిత సమాజం కోసం కృషి చేయాలి




కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న ఏసీపీ సంపత్‌కుమార్

ఉప్పల్, మే 28 : ఆకలి రహిత సమాజం కోసం కృషి చేయాలని అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ పోలీస్ సంపత్‌కుమార్ అన్నారు. హబ్సిగూడలోని మలబార్ గోల్డ్ అండ్ డైమండ్స్ స్టోర్‌లో వరల్డ్ హంగర్ డే కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సామాజిక సేవా కార్యక్రమంలో భాగంగా 'ఆకలి రహిత ప్రపంచం' కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ..సామాజిక సేవలు అందించడం అభినందనీయమన్నారు. ఆహారం కోసం ఇబ్బందులు పడేవారిని గుర్తించి, వారికి తగిన తోడ్పాటు అందించాలన్నారు. ఐక్యరాజ్యసమితి సస్టైనబుల్ డెవలప్‌మెంట్ గోల్-2 జీరో హంగర్ ప్రోగ్రాంకు మద్దతుగా ఈ కార్యక్రమం చేపట్టినట్లు నిర్వాహకులు మొహమ్మద్ అహ్మద్ సోఫి తెలిపారు. ఆకలితో ఉన్నవారికి పౌష్టికాహారం అందించడం బాధ్యతగా భావించాలన్నారు. సంక్షేమం, సామాజిక సేవా కార్యక్రమాలను చేపడుతున్నామని తెలిపారు.

## గంజాయి విక్రయానికి యత్నం.. ఇద్దరు అరెస్టు

కీసర, మే 28: గంజాయి విక్రయానికి యత్నిస్తున్న ఇద్దరు యువకులను కీసర పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. సీఐ కథనం ప్రకారం .. కీసర మండలం, రాంపల్లి ప్రాంతంలోని ఇండియన్ ఆయిల్ పెట్రోల్ బంక్ వద్ద మార్కు అరుణ్, బాదోత్ గణేశ్‌లు నంబర్‌ప్లేట్‌లేని బైక్‌పై వచ్చి గంజాయి విక్రయానికి యత్నిస్తున్నారు. అదే సమయంలో పోలీసులు రాగా అనుమానంతో వారిని తనిఖీ చేస్తుండగా తప్పించుకునే ప్రయత్నం చేశారు. వెంటనే ఎస్సై మధుతో పాటు పోలీసు బృందం వారిని పట్టుకున్నారు. వారి నుంచి 2 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకోవడంతో పాటు కేటీఎం బైక్‌ను, మొబైల్ ఫోన్‌లను స్వాధీనం చేసుకున్నారు.

## విద్యతో వ్యాపారం చేయవద్దు : ఏబీవీపీ

రామంతాపూర్, మే 28 : ప్రైవేటు కళాశాలల యాజమాన్యాలు విద్యతో వ్యాపారం చేయవద్దని ఏబీవీపీ రాష్ట్ర నేత బుర్ర అఖిల్ పేర్కొన్నారు. మంగళవారం రామంతాపూర్‌లోని పలు కళాశాలలను ఆయన సందర్శించి మాట్లాడుతూ.. జూన్ నెల ప్రారంభం కానుండటంతో ప్రైవేటు కళాశాలలు విచ్చలవిడిగా విద్యార్థుల తల్లిదండ్రుల వద్ద లక్షల్లో ఫీజులు వసూలు చేస్తున్నాయన్నారు. ఈ టెక్నో, కాన్సెప్ట్ ,గ్రామర్ తదితర పేర్లతోఎల్‌కేజీ, యూకేజీ లోనే లక్షల ఫీజులు దండుకుంటున్నాయన్నారు . ప్రభుత్వం వీటిపై దృష్టి సారించి.. ఫీజు నిబంధన చట్టం అమల్లోకి తేవాలన్నారు.

## రోడ్లకు మరమ్మతులు చేపట్టాలి

నేరేడ్‌మెట్, మే 28 : వినాయకనగర్ డివిజన్, కాకతీయనగర్ ప్రధాన రహదారిలో నెలకొన్న అంతర్గత రోడ్లకు మరమ్మతులు చేపట్టాలని స్థానికులు కోరారు. అధ్వాన్న రోడ్లతో పాదచారులు, ద్విచక్ర వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. ఇప్పటికైనా అంతర్గతరోడ్లను వెంటనే బాగుచేయాలని స్థానికులు కోరుతున్నారు. ఈ మేరకు కార్పొరేటర్ రాజ్యలక్ష్మి మా ట్లాడుతూ.. రోడ్లు , ఇతర సమస్యలను వెంటనే పరిష్కరించేందుకు కృషి చేస్తామని తెలిపారు.

# మిషన్ భగీరథ పైపులైన్‌కు మరమ్మతులు

నమస్తే తెలంగాణ ఎఫెక్ట్

మేడ్చల్, మే 28 : 'నమస్తే తెలంగాణ' కథనానికి అధికార యంత్రాంగం కదిలివచ్చింది. మిషన్ భగీరథ పైపులైన్ లీకేజీ మరమ్మతుకు సమాయత్తం అయింది. మేడ్చల్ పట్టణంలో మేడ్చల్ నుంచి కిష్టాపూర్‌కు వెళ్లేదారిలో వేసిన మిషన్ భగీరథ మెయిన్ పైపులైన్‌కు దాదాపు 13 నెలల కిందట లీకేజీ ఏర్పడింది. దీంతో తారురోడ్డు ధ్వంసమై నీరు వృథాగా పోతుంది. అంతేగాకుండా నీరు కలుషితం అవుతుంది. ఈ విషయంలో అధికారులు అనుసరిస్తున్న నిర్లక్ష్య వైఖరిని 'నమస్తే తెలంగాణ' మిషన్ భగీరథ పైపులైన్‌కు లీకేజీ..పేరుతో కథనం ప్రచురించింది. ఇందుకు స్పందించిన అధికార యంత్రాంగం లీకేజీని యుద్ధ ప్రాతిపాదికన పూర్తి చేసేందుకు సిద్ధమైంది. మిషన్ భగీరథ డీఈఈ మహేందర్, ఏఈ వసుధ మంగళవారం ఉదయాన్నే నీరు లీకేజీ అవుతున్న ప్రదేశానికి చేరుకుని పరిశీలించారు. వెంటనే మున్సిపాలిటీ, ఆర్అండ్‌బీ, ట్రాఫిక్ అధికారులతో మాట్లాడారు. వారి సహకారంతో జేసీబీ, బ్రేకర్, సిబ్బంది సాయంతో రోడ్డును తవ్వి, మెయిన్ పైపులైన్‌కు లీకేజీ ఉన్నట్టు గుర్తించారు. ఈ సందర్భంగా డీఈఈ మహేందర్ మాట్లాడుతూ.. పైపులైన్ లీకేజీ విషయాన్ని వివిధ శాఖ అధికారుల దృష్టికి తీసుకెళ్లి, అవసరమైన అనుమతులు తీసుకున్నామని తెలిపారు. ఒక రోజులో మరమ్మతు పనులు పూర్తి చేస్తామని, వెంటనే మున్సిపాలిటీ అధికారుల సహకారంతో వాహనదా రులకు ఇబ్బంది కల్గకుండా తారు వేసేందుకు కూడా చర్యలు తీసుకోనున్నట్లు వివరించారు.



పైపులైన్ మరమ్మతు పనులను పర్యవేక్షిస్తున్న డీఈఈ మహేందర్, ఏఈ వసుధ

## హోటళ్లలో కమిషనర్ ఆకస్మిక తనిఖీ

మేడ్చల్ కలెక్టరేట్, మేడ్చల్ 28 : నాగారం మున్సిపాలిటీ పరిధిలోని పలు హోటళ్లు, రెస్టారెంట్లను మంగళవారం కమిషనర్ రాజేందర్ కుమార్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. నిబంధనలకు విరుద్ధంగా నాణ్యతలేని ఆహార పదార్థాలను వినియోగిస్తున్న హోటళ్లకు రూ.45వేల జరిమానా విధించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ.. హోటళ్లు, రెస్టారెంట్లతో నాణ్యతా లోపంగా ఉన్న ఆహార పదార్థాలను విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ తనిఖీలో మేనేజర్ చంద్రశేఖర్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ రాంరెడ్డి, లైసెన్స్ ఇన్‌స్పెక్టర్ ధర్మారెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.



హోటల్‌లో తనిఖీ నిర్వహిస్తున్న కమిషనర్ రాజేందర్ కుమార్

## ఆర్థిక ఇబ్బందులతో గృహిణి ఆత్మహత్య

పీర్జాదిగూడ, మే 28: ఆర్థిక ఇబ్బందులు తాళలేక ఓ గృహిణి ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. ఈ సంఘటన మేడిపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పో లీసుల తెలిపిన వివరాల ప్రకారం...పీర్జాదిగూడ పర్వతాపూర్ లక్ష్మీనగర్‌కాలనీకి చెందిన వి. పార్వతి (42) కుటుంబ సభ్యులతో కలిసి ఉంటుంది. కాగా..భర్త మహేశ్ గత కొన్ని సంవత్సరాల నుంచి అనారోగ్యం(టీబీ వ్యా ధి)తో బాధపడుతున్నాడు. దీంతో అతనికి వైద్యం చేయించడానికి పలువురి వద్ద అప్పుగా తీసుకున్న డబ్బులు ఇవ్వలేక పోవడంతో తీవ్ర మనస్తాపానికి గురైంది.ఈ క్రమంలో సోమవారం రాత్రి పార్వతి ఇంట్లో ఫ్యాన్‌కు చీరతో ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.



పార్వతి (ఫైల్)

## అప్పుల బాధతో వ్యక్తి..

శామీర్‌పేట, మే 28 : అప్పుల బాధతో ఓ వ్యక్తి ఆత్మహ త్య చేసుకున్నాడు. ఈ సంఘటన జీనోమ్‌వ్యాలీ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. శామీర్‌పేట మండలం, తుర్కపల్లి గ్రామానికి చెందిన రుద్రబోయిన మహేందర్(35) స్క్రాప్ దుకాణం నడిపిస్తున్నాడు. కాగా.. గ్రామానికి చెందిన ఓ వ్యక్తి వద్ద రూ.6 లక్షలు అప్పుగా తీసుకున్నాడు. ఆ తర్వాత రూ.4 లక్షల 70 వేలు తిరిగి చెల్లించినప్పటికి మిగిలిన డబ్బులు చెల్లించాలని అప్పు ఇచ్చిన వ్యక్తి అడుగుతున్నాడు. దీంతో మనస్తాపానికి గురైన మహేందర్ తన షాపులో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

## మేడ్చల్‌లో యువతి..

మేడ్చల్, మే 28 : ఓ యువతి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన మేడ్చల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసుల కథనం ప్రకారం...ఒడిశా రాష్ట్రం గజపతి జిల్లా పర్లాకిమిడి ప్రాంతానికి చెందిన మాధవరావు కుటుంబం దాదాపు 15 ఏండ్ల కిందట ఉపాధి కోసం మేడ్చల్‌కు వచ్చి, స్థిరపడింది. మాధవరావు కూతురు శైలజ(24) స్థానికంగా ఉన్న ఒక ప్రైవేట్ కంపెనీలో పని చేస్తుంది. మాధవరావు, ఆయన భార్య మంగళవారం విధుల నిర్వహణకు వెళ్లగా శైలజ ఇం ట్లో ఉన్నది. మంగళవారం సాయంత్రం కుటుంబ సభ్యులు ఇంటికి వచ్చేసరికి శైలజ ఉరేసుకొని, సీలింగ్‌ఫ్యాన్‌కు వేలాడుతూ కన్పించింది. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

## నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు..

కాప్రా, మే 28: సైనిక్‌పురి సబ్‌స్టేషన్ 11కేవీ కళ్యాణపురి ఫీడర్ పరిధిలో విద్యుత్‌లైన్ల లో మరమ్మతులు, ట్రీకటింగ్ కారణంగా బుధవారం ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 12.30 గంటలవరకు నిర్మల్‌నగర్, సాయిపురి, హస్తినాపురి, సైనిక్‌పురి ప్రాంతా ల్లో విద్యుత్ సరఫరా ఉండదని ఏఈ నరేందర్ తెలిపారు. అలాగే 11కేవీ సాయిపురి ఫీడర్ పరిధిలో మధ్యాహ్నం 12.30 నుంచి 2 గంటలవరకు డిఫెన్స్‌కాలనీ, హస్తినాపురి ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏఈ తెలిపారు.

*నాగారం మున్సిపాలిటీ పరిధిలో..*

మేడ్చల్ కలెక్టరేట్, మే 28 : నాగారం మున్సిపాలిటీ పరిధిలోని శివానందపూరి, రోజ్ వైడ్, ప్రగతినగర్, ఆర్‌సీ ఎన్‌క్లేవ్, వాయుశక్తినగర్, భవానీనగర్, కుషి, ఎన్ఆర్ఆర్ కాలనీలకు బుధవారం ఉదయం 11 నుంచి 12.30 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం విధిస్తున్నట్లు ఆ శాఖ అధికారులు తెలిపారు. అలాగే మధ్యాహ్నం 3 నుంచి 4.30 గంటల వరకు ప్రగతినగర్, వికాస్‌నగర్, శ్రీనివాస నగర్, వేంకటేశ్వరనగర్, సైలెంట్ ఎన్‌క్లేవ్ తదితర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదు.

**CAUTION NOTICE**

All the General Public are hereby informed that my client Dr Somesula Jagadeesh Babu S/o late S.V. Ramana Naidu R/o. B-4/B/1 Electronic complex Kushaiguda Hyderabad is the sole and absolute owner of M/s Soorya Hospitals situated in the said address and running the hospital as its sole and absolute owner. He has entered into Partnership Deed with his wife Mrs Somesula Hemavathi and his son Somesula Guru Ashrith Naidu and registered as Document No. 39/2017 dated 03-06-2017 and registered in Book IV with SRO Kapra in respect of Soorya Hospitals and his son has withdrawn from the partnership business under prior and written intimation to my client and due to family and other issues my client is living separately from his wife Mrs Hemavathi and she is not taking any part as partner of the said Hospitals. My client is solely looking after the affairs of the hospital and taking legal steps to convert the partnership into sole Proprietorship by deleting the name of his wife Hemavathi as one of the partners of the Soorya Hospitals. As such no person/s shall deal in any manner with the hospital issues and administration with Mrs Hemavathi and doing so will be at their sole risk and my client shall in no way be called upon to account for any such issues dealt with Mrs. Hemavathi and he shall not have any legal obligation to fulfill the issues of third parties dealing with Mrs Hemavathi in respect of M/s. Soorya Hospitals. As such they are cautioned not to enter into any transaction or issue with Mrs. Hemavathi in respect of Soorya Hospitals.

**Sd/- R.V.S.M. LAKSHMI,** ADVOCATE
Plot No:18, VIVEKANANDA NAGAR COLONY, NEREDMET
SECUNDERABAD.
Mob No: 9550837797

**బహిరంగ ప్రకటన**

ఇందుమూలంగా సాధారణ ప్రజలకు తెలియజేయునది ఏమనగా నా క్లయింట్ దిగువ తెలిపిన షెడ్యూలు ఆస్తిని (ఎ) సామ మహిపాల్ రెడ్డి తండ్రి లేట్ సామ యాదిరెడ్డి మరియు (బి) శ్రీమతి సామ సుమలత, ఇరువురి నివాసం: ఇం.నం. 5-1-81/108, అన్నపూర్ణ కాలనీ, మల్లాపూర్, ఉప్పల్ మండలం, మేడ్చల్-మల్కాజ్‌గిరి జిల్లా, తెలంగాణ వారి నుండి కొనుగోలు చేయుటకు ఉద్దేశిస్తున్నారు. పై ఉద్దేశిత అమ్మక లావాదేవి నిమిత్తం ఏదైనా అభ్యంతరం, క్లెయిమ్, ప్రయోజనం, వివాదం కలిగి ఉన్న అతను/ఆమె/వారు ఎవరైనా, ఈ ప్రకటన ప్రచురణ తేదీ నుండి ఏడు (7) రోజులలోగా అతని/ఆమె/వారి యొక్క అభ్యంతరాలు/క్లెయిమ్‌లు/వివాదం/ల వివరాలను మద్దతునిచ్చే డాక్యుమెంటరీ రుజువులతో దిగువ సంతకందారును సంప్రదించవలెను. లేనిచో, నా క్లయింట్ సదరు షెడ్యూలు ఆస్తికి సంబంధించి ఏ విధమైన మూడవ పార్టీ క్లెయిమ్‌లు/అభ్యంతరాలు/వివాదాలు లేవని భావించి పై యజమానితో అమ్మక లావాదేవి పూర్తి చేసుకునేందుకు ముందుకు సాగుతారు. ఆ తరువాత ఎటువంటి క్లెయిమ్‌లు/ అభ్యంతరాలు/ వివాదాలు స్వీకరించబడవు.

**షెడ్యూలు ఆస్తి**

మేడ్చల్-మల్కాజ్‌గిరి జిల్లా, ఉప్పల్ మండలం, GHMC, కాప్రా సర్కిల్ పరిధిలోని, మీర్‌పేట్, అన్నపూర్ణ కాలనీ వద్ద గల 300 చ.గజాలు లేదా 250.8 మీ. విస్తీర్ణపు ప్లాట్ నం.32లో స్టిల్ట్ ప్లస్ 3 పై అంతస్తులు కలిగి, స్టిల్ట్ ఫ్లోర్‌లో 823 చ.అ.లు, మొదటి అంతస్తులో 823 చ.అ.లు, రెండవ అంతస్తులో 823 చ.అ.లు మరియు మూడవ అంతస్తులో 823 చ.అ.లు ప్లింత్ ఏరియా కలిగిన నం. 5-1-86/2 గల ఇంటి యావత్తు మరియు సరిహద్దులు: **ఉత్తరం:** 30' వెడల్పు రోడ్డు, **దక్షిణం:** ప్లాట్ నం.36, **తూర్పు:** ప్లాట్ నం.33 & 34, **పశ్చిమం:** ప్లాట్ నం.31.

**సం/- అశీష్ సామత్, న్యాయవాది**
ఇం.నం. 1-8-54/1/1, 2వ అంతస్తు
మణి అంజయ్య మ్యాన్షన్,
సింధి కో-ఆపరేటివ్ బ్యాంక్ ప్రక్కన
పి.జి.రోడ్డు, సికింద్రాబాద్-500003
ఫోన్:+91 8142071912/040-23393363